క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలు


కూరగాయలు కొనుగోలు చేస్తున్న అధికారులు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాల స్టాల్ సోమవారం ఏర్పాటు చేశారు. ప్రకృతి సేద్యం ద్వారా పండించిన వంకాయలు, బెండకాయలు, చిక్కుడుకాయలు, బీరకాయలు, దొండకాయలు వంటి కూరగాయలను కార్యాలయానికి వచ్చిన వారు, కార్యాలయ సిబ్బంది కొనుగోలు చేశారు. ప్రకృతి వ్యవసాయ విధానాల ద్వారా పండించిన కూరగాయలు గానీ ఆకుకూరలు గానీ ఆరోగ్యానికి చాలా మంచివని ప్రకృతి వ్యవసాయం గుమ్మలక్ష్మీపురం క్లస్టర్ కో–ఆర్డినేటర్ కిమిడి భూషణరావు అక్కడికి వచ్చిన వారికి తెలిపారు.

ఆలయ పునఃనిర్మాణానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న గౌరునాయుడు దంపతులు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణానికి సంతోషపురానికి చెందిన అంబటి బోడినాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమారులు అంబటి గౌరునాయుడు, శ్రీనివాసరావులు రూ.1,00,116లను విరాళంగా సోమవారం అందజేశారు. దాతల సాయం మరువలేనిదని, మందిర పునఃనిర్మాణానికి తోడ్పడుతున్న ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలని ఆలయ అర్చకులు శ్రీకాంత్‌బాబు అన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి : పీఓ

సీతంపేట: సీసీడీపీ నిధులతో చేపడుతున్న పనులు సకాలంలో పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. స్థానిక ఐటీడీఏలో ఇంజినీరింగ్ అధికారులతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్షణగోడలు, మల్టీపర్పస్ కేంద్రాలు, గ్రామాలకు సీసీ రహదారులు వంటి పనులు డిసెంబర్ 15 నాటికి పూర్తి కావాలన్నారు. జీవనోపాదుల పథకాలు అమలు చేయడానికి లబ్ధిదారులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, ఈఈ రమాదేవి, డీఈ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగం

బలిజిపేట: మండలంలోని అంపావల్లిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పంటకోత ప్రయోగం నిర్వహించారు. పంటకోత ప్రయోగాల వల్ల పంట దిగుబడులు ఏమేరకు వచ్చాయనేది తెలుస్తుందని ఏఓ శ్రావణ్‌కుమార్‌నాయుడు ఈ సందర్భంగా తెలిపారు. ర్యాండమ్ పద్ధతిలో భాగంగా 86.21సర్వే నంబర్‌లో గల బంకురు గౌరునాయుడు పంటపొలంలో 5అడుగుల పొడవు, 5అడుగుల వెడల్పు విస్తీర్ణంలో పంటకోత ప్రయోగాన్ని నిర్వహించారు. ఈ విస్తీర్ణానికి 14.800కిలోల దిగుబడి వచ్చినట్లు ఏఓ తెలిపారు. ఈ ప్రకారం ఎకరాకు 2,397కిలోల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశాలున్నాయని చెప్పారు. రైతుల పంటలకు ఈక్రాప్ నమోదు చేయించుకోవడం వల్ల వారి పంటను వారే విక్రయించు కునేందుకు వీలుంటుందన్నారు.కార్యక్రమంలో వీఏఏ కె.శ్రావణ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

హైందవశక్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు దుస్తుల వితరణ

సీతానగరం: జిల్లాలో హైందవ శక్తి సంస్థద్వారా పేదలకు వివిధ రకాల దుస్తులను వితరణ చేయనున్నట్లు హైందవశక్తి జిల్లా ప్రతినిధి అల్లు వెంకటలక్ష్మి అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని బగ్గందొరవలస ఇంటింటికీ వెళ్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులను ప్యాంట్‌లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైందశక్తి స్వచ్ఛంద సంస్థ ద్వారా జిల్లాలోని పలుగ్రామాల్లో గ్రామ పెద్దల సూచనల మేరకు దుప్పట్లు, దుస్తులు, పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు బగ్గందొరవలసలో 30 మంది విద్యార్థులకు షర్టులు, ప్యాంట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హైందవ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.


పాలకొండ: శిథిలావస్థలో బాలికల సంక్షేమ వసతిగృహం రక్షణ గోడ


పాలకొండ: మధ్యలో నిలిచిపోయిన గిరిజన ఆశ్రమ పాఠశాల భవనాలు


కొమరాడ: చినఖేర్డిల బాలురు ఆశ్రమ పాఠశాల వసతిగృహం వద్ద పేరుకుపోయిన అపారిశుధ్యం


కొమరాడ: చినఖేర్డిల బాలురు ఆశ్రమ పాఠశాల వసతిగృహంలో ఇరుకైన గదిలో దగ్గర దగ్గరగా కూర్చొని భోజనం చేస్తున్న విద్యార్థులు

చిన్నబోతున్న సంక్షేమ హాస్టళ్లు

పాలకొండ: సంక్షేమ వసతిగృహాలు కూటమి ప్రభుత్వ హయాంలో చిన్నబోతున్నాయి. వసతులు కరువై విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులు క్షోభకు గురవుతున్నారు. పాలకొండ పట్టణంలో బీసీ, ఎస్సీ బాలికల వసతిగృహాలతో పాటు గిరిజన ఆశ్రమ పాఠశాల, విద్యార్థినిలకు పోస్టుమెట్రిక్ వసతిగృహాలు ఉన్నాయి. గిరిజన ఆశ్రమ పాఠశాలలో భవన నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వ హయాంలో మధ్యంతరంగా నిలిచిపోయాయి. బాలికల వసతిగృహం పరిస్థితి దారుణంగా మారింది. కనీస రక్షణ చర్యల్లేవు. ఇక్కడ సుమారు 70 మంది విద్యార్థినిలు ఉన్నారు. శిథిలమైన ప్రహరీ, ఊడిపోయిన రేకుల తలుపుల మధ్య విద్యార్థినిలు భయంభయంగా గడుపుతున్నారు. ఎస్సీ బాలుర వసతిగృహంలో తాగునీటి కష్టాలు నెలకొన్నాయి.

గురుకుల బాలుర పాఠశాలలో అవస్థలు

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 438 మంది విద్యార్థులు 3 నుంచి 10 వ తరగతి వరకు చదువుతున్నారు. కేవలం 12 తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. వర్షాలు వస్తే కొన్ని గదులు కారే పరిస్థితి కూడా ఉంది. పాఠశాలకు ఎటువంటి ప్రహరీ లేదు. సోలార్ ఫెన్సింగ్ కూడా లేదు. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.


భామిని: హాస్టల్ వరండాలో విద్యార్థినుల అవస్థలు

సమస్యల నడుమ ఏకలవ్య విద్యార్థులు

భామిని: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారు. విద్యార్థినిలు భోజనశాల వద్ద అవస్థలు పడుతున్నారు. చుట్టూ ప్రహరీ లేదు. ఆడుకునేందుకు ఆట స్థలం లేదు. విద్యార్థినులకు ఆరుబయట స్నానాలు తప్పడం లేదు. డార్మిటరీ పూర్తి కాక తరగతి గదుల్లోనే కాలక్షేపం చేస్తున్నారు. అసంపూర్తి భవనాల నడుమ అవస్థలు పడుతున్నారు.

సరిపడ గదులు లేవు..

కొమరాడ: స్థానిక కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం) వసతిగృహం ప్రహరీ ధ్వంసమైనా.. మరమ్మతులు చేసేందుకు చొరవ తీసుకోవడం లేదు. అంతేకాకుండా హాస్టల్ ప్రాంగణం పిచ్చిమొక్కలతో నిండిపోవడంతో పాటు పారిశుధ్య లోపం దండిగా కనిపిస్తోంది. ఇదే మండలంలోని చినఖేర్డిల గ్రామ గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమ పాఠశాల వసతిగృహంలో విద్యార్థులకు సరిపడ గదులు లేవు. దీంతో పాటు విద్యార్థుల్లో ఎవరైనా అనారోగ్యం బారినపడితే వారికి సకాలంలో చికిత్స అందించే వ్యవస్థ లేదు.

గుమ్మలక్ష్మీపురం/గరుగుబిల్లి: మండలంలోని భద్రగిరి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో తరగతులు, వసతి ఒకేచోట నిర్వహిస్తుండడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గరుగుబిల్లి మండల కేంద్రంలోని బీసీ వసతిగృహంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వసతిగృహానికి ప్రహరీ లేదు. విద్యార్థులకు సరిగ్గా కాస్మోటిక్ చార్జీలు కూడా అందించడం లేదు.


గుమ్మలక్ష్మీపురం: భద్రగిరి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో వసతిగృహంలోనే తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం


గరుగుబిల్లిలో ప్రహరీ లేని వసతిగృహం ఇదే..

మండల సమావేశం మళ్లీ వాయిదా


సమావేశం వాయిదా వేస్తున్న ఎంపీడీఓ

పాలకొండ: మండల సమావేశం మరోమారు వాయిదా పడింది. మండలంలో పూర్తి మెజార్టీ ఉన్న వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను కాదని టీడీపీ ఆధ్వర్యంలో మండల సమావేశం నిర్వహించేందుకు ప్రయత్నాలు చేశారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ ఎంపీపీ కూటమి నాయకులకు మద్దతుగా వెళ్లడంతో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు తమ బలం నిరూపించుకోవాల్సి వస్తుంది. మండలంలో 12 ఎంపీటీసీలు ఉంటే అందులో టీడీపీకి కేవలం ఇద్దరు ఎంపీటీసీలే ఉన్నారు. ప్రస్తుతం ఎంపీపీ మద్దతు ఇవ్వడంతో మరో ఎంపీటీసీ కలుస్తున్నారు. మిగిలిన ఎంపీటీసీలంతా వైఎస్సార్‌సీపీతోనే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో కూటమి నాయకులు కొంతమంది ఎంపీటీసీలను తమ పార్టీలో కలుపుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వారి మద్దతుతో సోమవారం సమావేశం నిర్వహించాలని ప్రయత్నించారు. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు హాజరు కాకపోవడంతో కోరం లేక మరోమారు వాయిదా వేయాల్సి వచ్చింది. ఆదివారం కూడా సమావేశం వాయిదా కావడంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తమ బలం చూపించుకున్నారు. 12 గంటల వరకు సభ్యుల కోసం ఎదురు చూసిన ఎంపీడీఓ విజయరంగారావు సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తిరిగి సమావేశం ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామని ప్రకటించారు.

పంట దిగుబడుల లెక్కింపు


పంటల దిగుబడి కోసం తూకం వేస్తున్న అధికారులు

పాలకొండ: ఈ ఏడాది ఖరీఫ్ పంటల దిగుబడి లెక్కింపు ముమ్మరంగా మండలంలో నిర్వహిస్తున్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, గణంక అధికారులు, ఇన్సురెన్స్ సిబ్బంది సమక్షంలో పంట కోత ప్రయోగాలు నిర్వహించి దిగుబడులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే మండలంలో 45 పంట కోత ప్రయోగాలు నిర్వహించామని ఏఎస్ఓ చిన్నారావు తెలిపారు. ఇంతవరకు తాము చేపట్టిన ప్రయోగాల్లో ఎకరానికి సుమారుగా 34 బస్తాలు ధాన్యం దిగుబడులు వస్తున్నాయని వివరించారు. ప్రతి గ్రామం పరిధిలో పంట దిగుబడుల లెక్కింపు చేపడుతున్నామని తెలిపారు.

ఎక్కడ చూసినా వనభో'జనాలే'..!


కార్తీకమాసం.. అందులోనూ సోమవారం.. ఎటుచూసినా వనభోజనాల సందడే కనిపించింది. చాలామంది తమ పిల్లాపాపలతో సరదాగా పిక్నిక్‌లకు వెళ్లి, సరదాగా గడిపారు. గరుగుబిల్లి మండలంలోని కొత్తూరు తోటల్లో పలువురు మధ్యాహ్నం కార్తీక వనభోజనాలు చేశారు. సాయంత్రం అంత్యాక్షరి, జల్లీ ఫైవ్ వంటి ఆటలు ఆడి, ఆనందించారు. -గరుగుబిల్లి

108 అంబులెన్స్ ఉద్యోగుల నిరసన


వీరఘట్టంలో నిరసన తెలియజేస్తున్న 108 అంబులెన్స్ సిబ్బంది

వీరఘట్టం: 108 అంబులెన్స్ సర్వీసులను ప్రభుత్వం నేరుగా నిర్వహించకుండా ప్రైవేటు సర్వీసు ప్రొవైడర్స్‌కు అప్పగించడం పట్ల సోమవారం వీరఘట్టంలో 108 సిబ్బంది నిరసన వ్యక్తం చేసారు. ప్రైవేటు సంస్థలకు 108 సర్వీసులను అప్పగించడంతో వారి లాభాపేక్ష వల్ల సర్వీసుల నాణ్యత పోతుందన్నారు. అందులో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు కనీస వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ సదుపాయాలు గ్రాట్యూటీ, పెన్షన్ సౌకర్యం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. 108 వాహనాల కండీషన్ లేకపోవడం వల్ల ప్రమాదాలకు గురై అనేక మంది ఉద్యోగులు మరణిస్తున్నారని వారికి ఎలాంటి పరిహారం కూడా ప్రభుత్వంగానీ, యాజమాన్యంగానీ చెల్లించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 25 నుంచి సమ్మె బాట పట్టనున్నట్లు తెలిపారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అనీష్

జియ్యమ్మవలస: మత్తు పదార్థాలతో జీవితం నాశనమవుతుందని, గంజాయి, మద్యం, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ అనీష్ సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గవరమ్మపేటలో మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై యువత, విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఫ్యాషన్ మాయలో పడి ఎంతోమంది యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలు చెడగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ చక్కని నడవడికతో సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు.

మద్యంసీసాల స్వాధీనం


పట్టుబడిన మద్యంసీసాలు చూపిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

గరుగుబిల్లి: మండలంలోని వల్లరగుడబలో అక్రమంగా నిర్వహిస్తున్న ఓ బెల్టుషాపు నుంచి 9 మద్యంసీసాలు స్వాధీనం చేసుకున్నామని సీఐ డి.పద్మావతి సోమవారం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి, ఓ వ్యక్తిపై కేసు కూడా నమోదు చేశామన్నారు. ఎక్కడైనా సారా అమ్మినా, తయారు చేసినా, మద్యం బెల్టుషాపులు నిర్వహించినా ఫోన్ నంబర్ 9440902373కు తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

1/70 చట్టాన్ని అమలు చేయాలి

సీతంపేట: 1/70 చట్టాన్ని గిరిజన ప్రాంతాల్లో అమలు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.లక్ష్మణరావు, కె.అవినాష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్డ్ ఏరియాలో గిరిజనేతరులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని గిరిజనేతరులు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రికి విన్నవించడాన్ని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ ఖండిస్తుందన్నారు. ఇదే జరిగితే ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

● హామీలు నెరవేర్చేదెప్పుడు...



కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం నగర పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని, తాగునీరు, రహదారులు నిర్మాణం చేయాలని కోరారు. పట్టణంలో పేదలకు రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలుగా అందించాలని కోరారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ నగర పంచాయతీ అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పి.తవిటిరాజు, కృష్ణమూర్తి, పద్మావతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. – పాలకొండ

బాలలను పనిలో చేర్చుకోరాదు..

భామిని: బాల కార్మికులను పనిలో చేర్చుకుంటే శిక్షార్హులు అవుతారని కార్మిక శాఖాధికారి సైలేష్ కుమార్ సోమవారం హెచ్చరించారు. మండల కేంద్రంలో ఆప్‌హోల్డ్ సంస్థ ఆధ్వర్యంలో బాల కార్మిక రెస్క్యూ డ్రైవ్‌లో పాల్గొని ఆయన మాట్లాడారు. దుకాణదారులకు పలు సూచనలు చేశారు. బాలలు బడిలో ఉండాలని, పనిలో కాదని పేర్కొన్నారు. సోషల్ వర్కర్ ప్రవీణ్‌కుమార్, సివిల్ పీసీ క్రాంతి, మహిళా పోలీస్ చందన పట్నాయిక్ ఆధ్వర్యంలో ప్రచార పోస్టర్ ఆవిష్కరించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం..

● మాజీ ఎమ్మెల్యే కళావతి


తాలాడలో మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, పార్టీ నాయకులు

భామిని: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని, దీన్ని నుంచి వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు, శ్రేణులను కాపాడుకునేందుకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని తాలాడకు చెందిన పార్టీ నాయకుడు టంకాల అప్పారావు(84) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను కళావతి సోమవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. అనంతరం గిరిజన నాయకులతో సమావేశమయ్యారు. జీసీసీ ఎన్నికలపై చర్చించారు. వేసిన నామినేషన్లపై ఆరా తీశారు. వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, పార్టీ నాయకులు కాగితాపల్లి కృష్ణారావు, బొడ్డేపల్లి ప్రసాద్, బంటు శ్రీనివాస్, ఎరుకుమజ్జి పాపినాయుడు, గిరిజన నాయకులు పిరపక శ్రీనివాసరావు, పత్తిక సింహాచలం ఉన్నారు.

స్వచ్ఛ పంచాయతీలుగా తీర్చిదిద్దండి


మాట్లాడుతున్న స్వచ్ఛ ఆంధ్ర సలహాదారు శ్రీనివాసన్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ప్రతీ గ్రామ పంచాయతీని స్వచ్ఛ పంచాయతీగా తీర్చిదిద్దాలని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి టి.కొండలరావు సూచించారు. కురుపాం ఎంపీడీవో కార్యాలయంలో స్వచ్ఛ, సుందర పార్వతీపురం మన్యం జిల్లా కార్యక్రమంలో భాగంగా కురుపాం నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎంపీడీవోలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ రాజ్ సిబ్బంది, గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం ఇంజినీరింగ్ అధికారులు, ఈవోపీఆర్‌డీలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. స్వచ్ఛ ఆంధ్ర సలహాదారు శ్రీనివాసన్‌తో కలిసి కాసేపు మాట్లాడిన ఆయన.. గాంధీ కలలుగన్న గ్రామ సీమలు నెలకొల్పాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛమైన గాలి, నీరు, పరిసరాలు ఉండేలా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి పద్మావతి, జట్టు ఆశ్రమ నిర్వాహకులు పద్మజ, డ్వామా పీడీ కె.రామచంద్రారావు తదితరులు పాల్గొన్నారు.


పాలకొండ: నక్కలపేటలో ప్రత్యేక పూజలు అందుకుంటున్న మరకత లింగేశ్వరుడు


వీరఘట్టం: కుంబిడిలో కుంబేశ్వరునికి పూజలు చేస్తున్న భక్తులు


వీరఘట్టం: వండువలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి


గరుగుబిల్లి: గొట్టివలస శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మారుమోగిన శివనామస్మరణ

కార్తీకమాసం మూడో సోమవారం ఆలయాలు భక్తుల శివనామస్మరణతో మారుమోగాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. పలు ఆలయాల వద్ద అన్నసమారాధన నిర్వహించారు. ఆలయాలను విద్యుత్ కాంతులతో అలంకరించారు. – సాక్షి నెట్‌వర్క్